

# జై భీమ్

తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 258 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 19, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# విగ్రహ ధ్వంసం.. విషాదం!

ఉద్యమ గడ్డలో ఊహించని పరిణామాలు

ఆధిపత్యం కోసం అణిచివేత

ప్రజా విశ్వాసంతో పనిలేకుండా పోతుంది

ఒకరికి గౌరవం..... మరొకరికి అవమానం...

అధికారం ఉంటే ఏమైనా చేయొచ్చా..

అధికార దుర్వినియోగంపై ఎక్కడలేని విమర్శలు..

ఉద్యమకారుల జీవితాలపై చెరగని ముద్రలు

ఉద్యమ గడ్డ రాజకీయ చరిత్రకారుల జీవితాలను తలకిందులు చేసింది

రాజకీయ పదవులు ఎప్పుడు శాశ్వతం కాదు

నర్సంపేట్ మాజీ ఎమ్మెల్యే పెద్ది ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు

విగ్రహాలను కూల్చివేస్తే ప్రజావిశ్వాసం పోతుందా

డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రను ఎప్పుడు ప్రస్తావించాల్సి వచ్చిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ ప్రస్థానం చరిత్రను నిలిపిందని డాక్టర్ బరిగెల శివ గర్వపడ్డారు. నర్సంపేట నియోజకవర్గంలో దివంగత శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి అకాల మరణాంతరం బిఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసుకున్న పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అకారణంగా కూల్చివేయడం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తట్టుకోలేకపోతున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా అణిచివేత ప్రదర్శించి విగ్రహ కూల్చివేతపై పెద్ది అభిమానులను పెద్ది సహచర రాజకీయ నాయకులను కనీసం మాట్లాడనివ్వకపోవడం విచారకరమన్నారు. ఉద్యమ స్ఫూర్తికి ఆదర్శంగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి జరిగిన అవమానం బీఆర్ఎస్వి యువత ఏమాత్రం తట్టుకోలేక పోతున్నారని తమ అభిమాన నాయకున్ని కోల్పోవడమే కాకుండా యువత అభిమానంగా ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని అర్ధరాత్రి వేళ కూల్చి వేయడమే కాకుండా కార్యకర్తలను అభిమానులను నాయకులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులతో నిర్బంధించి ప్రతిపక్ష నేతల నోళ్లు మూయించడం జరిగిందని మండిపడ్డారు. అభిమానంతో ఏర్పాటు చేసుకున్న విగ్రహాన్ని కూల్చివేయడం వల్ల అధికార పార్టీకి చెందిన నేతలకు వచ్చిన లాభమేంటో తెలియదు గాని ప్రజల విశ్వాసంతో ప్రజల నమ్మకంతో ప్రజల అభిమానంతో ప్రజల అనురాగాలతో ప్రజల ఆధరాబిమానాలతో చెలగాటలలాడడం సరైనది కాదన్నారు. రాజకీయపరమైన అభివృద్ధిని కనపరుస్తున్నప్పుడు రాజకీయ నాయకులపై ప్రజా విశ్వాసం బలంగా పెరుగుతున్నదన్నది

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





## పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం

పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం

2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం

హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



5

## ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

- సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం

విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి



6

## పేదల ఇళ్ల నిర్మాణానికి పారిశ్రామిక తోడ్పాటు

ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా

సామాజిక బాధ్యతను ప్రశంసించిన మంత్రి పొంగులేటి



2

## 20 నుంచి సిఎం రేవంత్ విదేశీ పర్యటన

### పది రోజుల పాటు యూకె, అమెరికా సందర్శన

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 20వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా

- మిగతా 2లో..



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# 20 నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

మొదటి పేజీ తరువాయి

విమానంలో సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20 ఉదయం 7 గంటలకు యూకే స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకోనున్నారు. ఆగస్టు 21న ఉదయం 10:30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కోసం ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 22న ఉదయం 10:30 గంటలకు కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఉదయం 11:30 గంటలకు లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనెట్ హౌస్‌ను సందర్శించ నున్నారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు. యూకే పర్యటన అనంతరం ఆగస్టు 23న సీఎం రేవంత్ రెడ్డి లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ కూడా పలు ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించి సమావేశాల్లో పాల్గొననున్నారు. 24న ఉదయం 10:30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటి క్యాంపస్‌ను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు బాస్టన్ నుంచి న్యూయార్క్‌కు బయలుదేరనున్నారు. 25న ఉదయం 10:30 గంటలకు నోర్త్–ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందంతో సమావేశం కానున్నారు. 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, వివిధ వర్గాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది. అమెరికా పర్యటన ముగించుకుని ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. 30న హైదరాబాద్ చేరుకోనున్నారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు పలు ప్రతినిధి బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటన ద్వారా విద్య, పరిశ్రమలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సంబంధించిన అంశాలపై చర్చలకు అవకాశం ఉండనుంది.

# మెట్రో ఫేజ్-2 అనుమతులకు కసరత్తు

### ప్రక్రియను వేగం చేసే పనిలో అధికారులు

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు సంబంధించిన అనుమతుల పక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌సీఓలను త్వరగా జారీ చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులతో జయేష్ రంజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్‌ఎమ్‌ఆర్‌ఎల్ ఎండీ, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. కేంద్ర అనుమతుల కోసం డీపీఐఐటీ నెట్‌వర్క్ ఎ÷–లానింగ్ గ్రూప్ పక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఫేజ్?2లో భాగంగా 7 కారిడార్ల ద్వారా మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన భూసేకరణ, రైల్వే క్రాసింగ్‌లు, మూసీ నది దాటే ప్రాంతాలు, గ్యాస్ పైప్‌లైన్లు, విమానాశ్రయ పరిధిలో నిర్మాణ అనుమతులపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతిపాదిత కారిడార్లకు అన్ని శాఖలు త్వరితగతిన ఎన్‌సీఓలు జారీ చేయాలని సర్ఫరాజ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఫేజ్?2 పనులు ముందుకు సాగితే హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత విస్తరించి, నగరంలో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

# రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి లక్షల కోట్ల ఆస్తులు

### సర్కారు కుట్రలకు తెలంగాణ ప్రజలు బలి: బిఆర్ఎస్

హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్): హైదరాబాద్‌లో లక్షల కోట్ల విలువైన ప్రజల ఆస్తులకు రేవంత్‌రెడ్డి సర్కారు '22–ఎ' తో సంకెళ్లు వేసిందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. సామాన్యుల ఆస్తులను, దశాబ్దాలుగా ఉంటున్న కాలనీలను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి నెట్టి, సామాన్యుడి కాళ్ల కింద నేలను లాక్ చేశారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్రావు, వినోద్, సత్యవతి రాథోడ్ తదితరులు మాట్లాడారు. ఆస్తులు అమ్ముకోలేక, కనీసం బ్యాంకులో కుదువపెట్టి అప్పు తెచ్చుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజల ఆస్తులను బందీ చేసిన ఈ తుగ్లక్ ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అండగా నిలబడుతామని అన్నారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు వారి ఆస్తులను ఇప్పిస్తామని చెప్పారు.

# మైనింగ్ క్వారీ ప్రమాదం కేసు

### అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్

### మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్

**అమరావతి,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

ప్రకాశం జిల్లాలో మైనింగ్ క్వారీలో జరిగిన ప్రమాదం కేసులో అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో పలువురి ప్రమేయం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధి, కన్‌స్టలెంట్‌ను అరెస్ట్ చేశారు. వీరిని విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నారు. గతంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు కూడా సీబీఐ గుర్తించింది. అనుకూల నివేదికతో పాటు మైనింగ్ సంస్థ నుంచి త్రైమాసిక లంచాల కోసం రూ. 2 లక్షలు ఏర్పాటు చేసినట్లు కనుగోంది. మైనింగ్ క్వారీ ప్రమాదంలో అనుకూల నివేదిక కోసం రూ. 2 లక్షల నగదు తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. సందర్భంగా ఆ నగదును సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒంగోలు, కడప, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన ఇళ్లలో కూడా సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

# విగ్రహాల ధ్వంసం విషాదం



మొదటి పేజీ తరువాయి

గమనించుకోవాల్సిన విషయమై ఉంటుండగా నియోజకవర్గ పరిధిలో ఒక ప్రతిపక్ష ప్రధాన నేత విగ్రహాన్ని కూల్చివేయడం వల్ల తనకున్న పేరు ప్రఖ్యాతలను తనకున్న అబిమానాన్ని ప్రజల్లో చెదరగొట్టగలిగామని అనుకోవడం పొరపాటునన్నారు.

**ఉద్యమంపై ఉవ్వెత్తున దాడులు..**

ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారులకు కేంద్ర బిందువు లాంటిదని ఉద్యమాలు చేస్తున్న ఉద్యమకారులను అణిచివేయడం తరతరాలుగా జరుగుతుందని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అలాంటి ఉద్యమాలు నేటికీ కొనసాగించబడడం ఒకింత బాధాకరమన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజా పాలనలో ప్రతిపక్ష నేతలు ప్రజా రక్షణ పోరాటాల్లో భాగంగా ఉద్యమాలు కొనసాగించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అవకాశాలు కల్పిస్తున్నట్లుగా పెద్ది విగ్రహం మధ్య రాత్రి కూల్చివేసిన సంఘటన తెలియజేస్తుందన్నారు. ఉన్నపాటుగా జిల్లా పోలీసు యంత్రాంగం ఒక్కసారిగా ప్రతిపక్షాలపై విరుచుకుపడడం బాధాకరమన్నారు.రాజకీయాలు అన్నాక ప్రజాసేవలో పోటీపడుతూ ప్రజాభివృద్ధికి పాటుపడాలి అంతేగాని కక్ష సాధింపు చర్యల కోసం ముందుకు సాగడం రాజకీయాలను అవమానపరచడమేనన్నారు.ముఖ్యంగా చనిపోయిన నాయకులను అవమానపరచకూడదని చనిపోయిన వ్యక్తుల పట్ల అసభ్యకరంగా మాట్లాడకూడదని కనీస పరిజ్ఞానం లేకపోవడం నేటి రాజకీయాలు దారి తప్పుతున్నట్లుగా కనిపిస్తుందన్నారు.ఉద్యమాలపై దాడులు చేయడం ఉద్యమకారులను అక్రమ అరెస్టుల పేరుతో నిర్బంధించడం ఉద్యమ స్ఫూర్తికి విరుద్ధమని ప్రభుత్వం అన్నాక అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెట్టాలి గాని అణిచివేతపై కాదన్నారు.ఒకవైపు పెద్దిని కోల్పోయిన బాధలో కుటుంబ సభ్యులు దుక్కసాగరంలో ఉంటుండగా రాజకీయం అడ్డం పెట్టుకొని పెద్దిని అవమాన పరచడం కుటుంబాన్ని మరింత బాధలోనికి నెట్టివేయడమేన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లెక్కలేనన్ని విగ్రహాలు ఏర్పాటు చేయబడుతున్నాయని వాటినన్నిటిని అధికారికంగా ప్రతిష్టిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గౌరవాన్ని చాటుకుంటుండగా పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసుకున్న వ్యక్తిగత విగ్రహాన్ని కూల్చివేయడమే కాకుండా నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం విచారకరంగాను వికృతి చేష్టలకు పరాకాష్టగానం ఉందన్నారు.ఉద్యమ నేతకు ర ఎక్కడ లేని ఆదరణ లభించిందనే కోపంతో విగ్రహం కూల్చివేశారంటూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విగ్రహ కూల్చివేతను తీవ్రంగా ఖండిస్తూ సోషల్ మీడియాలో మాధ్యమాల్లో వాళ్ళ అభిమాన నాయకునిపై ప్రేమానురాగాలను కనపరచారన్నారు.అదే సందర్భంలో మధ్య రాత్రి జరిగిన సంఘటనకు శాంతి భద్రతలు విగాదం కలగకుండా రాజకీయ నాయకులను కట్టడితోపాటు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పోలీసు వర్గాలు రాజకీయ నాయకులను అరెస్టు చేసిన సందర్భాలు తెలియజేస్తున్నాయన్నారు.ఉమ్మడి వరంగల్ ఉద్యమస్ఫూర్తిని అంచలంచలుగా అవమానిస్తున్నారని, అణిచివేస్తున్నారని అదిమిపట్టే ప్రయత్నం చేస్తున్నారని జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియా ప్రభుత్వానికి గట్టి సమాధానం చెబుతుందన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మధ్య రాత్రి కూల్చివేసిన విగ్రహాన్ని తిరిగి నిర్మించాలని ఎలాంటి అవాంతరాలు అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వకుండా ప్రభుత్వం తగిన విధంగా స్పందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారులు కోరుతున్నారన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ నాయకుల భవితత్వాన్ని ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు చరిత్ర కలిగిన నాయకుల రాజకీయ జీవితాలు తారుమారైపోతున్నాయని జ్ఞాపకం చేశారు.



# పేదల ఇళ్ల నిర్మాణానికి పారిశ్రామిక తోడ్పాటు

### ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా

### సామాజిక బాధ్యతను ప్రశంసించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశాం.



అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం చుట్టాం.

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్దిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. మంత్రిగారి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను 230 రూపాయిలకు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో అసెంబ్లీ ఫలితాలో రిపీట్

## బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు జోస్యం

**విశాఖపట్నం,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్) :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఫలితాలే రిపీట్ అవుతాయని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు జోస్యం చెప్పారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కూడా కూటమి కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి డబుల్ స్టాండ్ ప్లే చేస్తున్నారని మండిపడ్డారు. శాసనమండలికి వైసీపీ ఎమ్మెల్సీలు వస్తున్నారు.. కానీ శాసనసభకు దుమ్మా కొడుతున్నారని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఎవరో మిస్ గైడ్ చేస్తున్నారని అన్నారు. వైసీపీని నాశనం చేయడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే .. అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పడం సరికాదని అభిప్రాయపడ్డారు. సెంబ్లీకి వస్తే తనకు మాట్లాడే సమయం ఇవ్వరని వైఎస్ జగన్ ఊహాజనితమైన భావనలో ఉన్నారన్నారు. అసెంబ్లీలో తమ సమయం కూడా.. మీకే ఇస్తామని జగన్మోహన్ రెడ్డికి ఆఫర్ కూడా ఇచ్చామని గుర్తు చేశారు. అయినా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి రాలేదని అసహనం వ్యక్తం చేశారు. ÷ఔటమి ప్రభుత్వంలో ఎటువంటి అరాచకాలు ఉండవని ఆయన కుండబద్దలు కొట్టారు. .. దయచేసి అసెంబ్లీకి రావాలని జగన్‌కు స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేలకు.. ప్రజలు ఎందుకు ఓటు వేయాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు సందేహం వ్యక్తం చేశారు.

# అంబాలాలో పీజేటీఏయూ వ్యవసాయ విద్యార్థుల క్షేత్రస్థాయి అధ్యయనం





**రైతుల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన.. సుస్థిర వ్యవసాయాభివృద్ధికి పరిష్కారాల అన్వేషణ**

**హన్మకొండ, 18 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ)కు చెందిన వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం (రావే)లో భాగంగా హనుమకొండ జిల్లా అంబాలా గ్రామంలో క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టారు. గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు విధానాలు, అందుబాటులో ఉన్న వనరులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు విద్యార్థులు రైతులతో కలిసి పనిచేస్తున్నారు. గ్రామ వ్యవసాయ పరిస్థితులను సమగ్రంగా అర్థం చేసుకునేందుకు విద్యార్థులు పాల్గొనే గ్రామీణ విశ్లేషణ విధానం ద్వారా అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా రైతులతో నేరుగా చర్చిస్తూ గ్రామంలోని వ్యవసాయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను నమోదు చేస్తున్నారు. గ్రామంలోని వనరులు, వాటి వినియోగం, సాగు విధానాలు, వ్యవసాయంలో ఎదురవుతున్న సమస్యలను రైతుల అభిప్రాయాల ఆధారంగా గుర్తిస్తున్నారు. ఈ అధ్యయనంలో భాగంగా వనరుల పటాలు, సాంకేతిక పటాలు, చపాతీ చిత్రాలు, ప్రాధాన్యత క్రమ నిర్ణయం, కాలానుగుణ వ్యవసాయ క్యాలెండర్లు వంటి పలు పద్ధతులను విద్యార్థులు ఉపయోగిస్తున్నారు. గ్రామంలోని భూములు, నీటి వనరులు, సాగు ప్రాంతాలు, వ్యవసాయ వనరుల వినియోగం, రైతులు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయిస్తున్నారు. వివిధ కాలాల్లో చేపట్టే పంటల సాగు, వ్యవసాయ పనులు, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, పంటలపై ప్రభావం చూపే అంశాలను కాలానుగుణ క్యాలెండర్ల ద్వారా నమోదు చేస్తున్నారు. రైతుల అనుభవాలను శాస్త్రీయ సమాచారంతో అనుసంధానం చేస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడే మార్గాలను అన్వేషిస్తున్నారు. పుస్తకాల్లో నేర్చుకున్న వ్యవసాయ శాస్త్ర పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులతో అనుసంధానం చేసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. రైతుల అనుభవాలను తెలుసుకుంటూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు, వనరుల సమర్థ వినియోగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సాధ్యమయ్యే పరిష్కారాలను విద్యార్థులు అన్వేషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. కేరళకు చెందిన ఆదిత్య వీపీ, నేహా జోసెఫ్, తెలంగాణకు చెందిన అమూల్య కలకొండ, సన్నుతి మేసపాము, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రైమా చక్రవర్తి, ఒడిశాకు చెందిన సలోనీ ఛత్రియా అంబాలా గ్రామంలో రైతులతో కలిసి క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఒకే గ్రామంలో రైతులతో కలిసి పనిచేయడం ద్వారా భిన్న ప్రాంతాల్లోని వ్యవసాయ పద్ధతులు, రైతుల సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పరస్పర అవగాహన పెంపొందించుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు కుమ్మరి లింగమూర్తి, కుమ్మరి కుమారస్వామి, కుమ్మరి నాగేశ్వరరావు, కుమ్మరి తిరుపతి, బోళ్ల విద్యాసాగర్, గంద్రకోట లింగమూర్తి, ఉడుతబోయిన రాజు తదితరులు విద్యార్థులతో తమ వ్యవసాయ అనుభవాలను పంచుకున్నారు. పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలు, స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులు, వ్యవసాయ పద్ధతులు, రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించారు. రైతులతో నేరుగా మమేకమై వారి అవసరాలను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి సమర్థవంతమైన సేవలు అందించేలా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. రైతుల క్షేత్రస్థాయి అనుభవాలను వ్యవసాయ విద్యార్థుల శాస్త్రీయ పరిజ్ఞానంతో కలపడం ద్వారా స్థానికంగా సుస్థిర వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడే పరిష్కారాలను గుర్తించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. అంబాలా గ్రామంలో కొనసాగుతున్న ఈ క్షేత్రస్థాయి అధ్యయనం రైతులు, వ్యవసాయ విద్యార్థుల మధ్య జ్ఞాన మార్పిడికి వేదికగా నిలుస్తోంది. రైతుల వాస్తవ సమస్యలను తెలుసుకుంటూ, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలను అన్వేషిస్తున్న విద్యార్థుల కార్యక్రమం గ్రామీణ వ్యవసాయాభివృద్ధికి ఉపయోగకరంగా మారుతోంది.

# 20న నిరుద్యోగుల మహా ధర్నాను జయప్రదం చేయండి

**సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి**

**హనుమకొండ,18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏం. చుక్కయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 20న హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరుద్యోగుల మహా ధర్నాను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మంగళవారం రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో హనుమకొండ సౌత్ మండల కమిటీ సమావేశం మండల కమిటీ సభ్యులు సప్పిడి మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించాయని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు పది లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. డీఎస్సీ, జేఎల్, డీఎల్, గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే వరకు నెలకు రూ.5 వేల నిరుద్యోగ భృతి అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహా ధర్నాలో నిరుద్యోగ యువత వందలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్, మండల కమిటీ సభ్యులు చేరి పెల్లి కుమారస్వామి, ఇస్లావత్ రవీందర్, దూడపాక రాజేందర్, జగనాల ఉప్పలయ్య, పకిడే రాణి, యజ్ఞం స్రవంతి, పొట్లపల్లి రాజు, రేణిగుంట్ల చందర్, తుపాకుల సుధాకర్, నేతకాని భారతి, సముద్రాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.




# కాకతీయ క్యాంటీన్‌ను సందర్శించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజనాల శ్రీహరి

**విద్యార్థులు, సిబ్బందికి అందుబాటు ధరల్లో నాణ్యమైన భోజనం అందించాలి**

**కేయూ క్యాంపస్, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సుబేదారి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని కాకతీయ క్యాంటీన్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వహకులు దూలం క్రాంతికుమార్ గౌడ్, సుదర్శన్‌లను అభినందించారు. విద్యార్థులతో పాటు ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్న బోధనా, బోధనేతర సిబ్బంది, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందికి అందుబాటు ధరల్లో నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని రాజనాల శ్రీహరి సూచించారు. క్యాంటీన్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులు, సిబ్బందికి మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, తెలుగు విభాగం, ఆర్ట్స్ కళాశాల నాన్–టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు భుక్యా రాజు నాయక్, జి. నిరంజన్, కె. చెందు, ఆబిద్ అలీ, కౌలా అశోక్, రాజేష్, కేశవ్, రాములు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. కాకతీయ క్యాంటీన్‌ను సందర్శించి నిర్వాహకులను అభినందించడంతో పాటు విద్యార్థులు, సిబ్బందికి నాణ్యమైన భోజనం అందించాలని సూచించిన రాజనాల శ్రీహరికి క్యాంటీన్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.




# మాదన్నపేటలో.. ప్రత్యేక వైద్య శిబిరం



**కమలాపూర్, 18 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమలాపూర్ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా, పల్లె దవాఖాన వైద్యులు డాక్టర్ హైదర్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కత్తి రమేష్, గ్రామ సెక్రటరీ విద్యాసాగర్ రెడ్డి, ఏఎన్ఎంలు సంపూర్ణ, సరస్వతి, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, మాధవి, సుభాషిని తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు.

# బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం

**జనగామ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహణ**








**జనగామ, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

జనగామ జిల్లాలోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో బాలల హక్కులు, బాలల రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వంగ రవికుమార్ విద్యార్థులకు బాలల హక్కులు, బాలలపై లైంగిక వేధింపుల నివారణ, పోక్సో చట్టం–2012, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిరోధం, ఆన్‌లైన్‌లో పిల్లల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలలపై ఎలాంటి వేధింపులు, హింస లేదా దుర్వినియోగం జరిగినా మౌనంగా ఉండకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా సహాయం పొందవచ్చని విద్యార్థులకు వివరించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ పిల్లల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, బాలల హక్కులను గౌరవిస్తూ వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ సోషల్ వర్కర్ ప్రణయ్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ వి. రవికుమార్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మనోజ్ కుమార్, అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని బాలల రక్షణకు సంబంధించిన అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం ముగింపులో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# శ్రావణమాస వరలక్ష్మీ పూజలో పాల్గొన్న నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి

**హన్మకొండ, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**




తెలుగు అమ్మాయి కిట్టీ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రావణమాస శ్రీ వరలక్ష్మీ పూజ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి మహిళలతో కలిసి శ్రావణమాస ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, మహిళల ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నాయిని నీలిమ రాజేందర్ రెడ్డికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రావణమాసంలో మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. మహిళలందరికీ శ్రావణమాస శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు 15 ఎకరాల స్థలం కేటాయింపు

**రాష్ట్ర ప్రభుత్వానికి తీర్మాన పత్రం సమర్పించిన కేయూ పాలక మండలి సభ్యులు**

**హైదరాబాద్, 18 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేసేందుకు 15 ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ విశ్వవిద్యాలయ పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ తీర్మాన పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు చిర్ర రాజు గౌడ్, సుధాకర్, సుదర్శన్, అనిత రెడ్డి, రమా రెడ్డి, సురేష్ లాల్, భాలు చౌహాన్, నవీన్, సుకుమార్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రామచంద్ర తదితరులు సచివాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి ప్రతిపాదన వివరాలను వివరించారు. విశ్వవిద్యాలయ పరిధిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు 15 ఎకరాల స్థలం కేటాయిస్తే విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వసతులు అందుబాటులోకి వస్తాయని పాలక మండలి సభ్యులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, సహకారం అందేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపై ప్రభుత్వ స్థాయిలో అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# సూర్యశ్రీ ఎరుకలకు డాక్టరేట్

**కేయూ క్యాంపస్, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగ పరిశోధకురాలు సూర్యశ్రీ ఎరుకలకు డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్‌ను ప్రకటించారు. సూర్యశ్రీ ఎరుకల రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య ఎస్. జ్యోతి పర్యవేక్షణలో "షిఫ్ బేస్ లోహ సముదాయాల సంశ్లేషణ, లక్షణ నిర్ధారణ మరియు జీవ సంబంధిత మూల్యాంకనం" అనే అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. హనుమకొండకు చెందిన డాక్టర్ సూర్యశ్రీ ఎరుకలకు డాక్టరేట్ లభించడం పట్ల కాకతీయ విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి విశ్వవిద్యాలయానికి, సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అంకుర సంస్థలపై శిక్షణ

**అంకుర సంస్థల స్థాపనపై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన**





**కేయూ క్యాంపస్, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ కే-హబ్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు టి-హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించారు. కే-హబ్ సంచాలకురాలు ఆచార్య టి. సవితా జ్యోత్స్న సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రుసా నోడల్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ ద్వారా నూతన అంశాలను నేర్చుకోవడంతో పాటు వాటిని ఆచరణాత్మకంగా అమలు చేయాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి కనీసం పది అంకుర సంస్థలు ఏర్పడతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. టి-హబ్ ప్రతినిధి బాల మురళి భాస్కరన్ విద్యార్థులకు అంకుర సంస్థల మార్గదర్శకత్వం, ఆలోచనల రూపకల్పన, ఆలోచనల సాధ్యాసాధ్యాల పరిశీలన తదితర అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించారు. విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా ఎలా మలచుకోవాలి, ఒక ఆలోచనలోని కొత్తదనం, సృజనాత్మకత, సాధ్యాసాధ్యాలను ఎలా గుర్తించాలి అనే అంశాలను వివిధ ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అంకుర సంస్థలు, వ్యాపార ఆలోచనలకు సంబంధించిన పలు ప్రశ్నలను అడిగారు. టి-హబ్ ప్రతినిధులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఆలోచనలను గుర్తించి, వాటికి సమర్థవంతమైన రూపకల్పన చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇలాంటి 15 శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కే-హబ్ సంచాలకురాలు ఆచార్య టి. సవితా జ్యోత్స్న తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, అంకుర సంస్థల స్థాపనపై అవగాహన, సృజనాత్మక ఆలోచనా శక్తి మరింత పెంపొందుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కే-హబ్ సంయుక్త సంచాలకులు డాక్టర్ సిద్ధూ, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన వృద్ధురాలు సుబేదారి పోలీసుల వద్ద

**ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలి**

**సుబేదారి 18 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పిపోయిన చిదురాల కలవ్వ అనే వృద్ధురాలు ప్రస్తుతం సుబేదారి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె భర్త పేరు రాజయ్య కాగా, కుమారులు యాదగిరి, రాజు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తప్పిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఆమెను గుర్తించిన వారు వెంటనే సుబేదారి పోలీసులను సంప్రదించాలని కోరారు. వృద్ధురాలిని ఆమె కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సుబేదారి ఎస్‌హెచ్‌ఓ 8712685114 / సుబేదారి పోలీస్‌స్టేషన్ 8712685003 నంబర్లకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులను గుర్తించేందుకు ప్రజలు ఈ సమాచారాన్ని తమ పరిచయ వర్గాల్లో విస్తృతంగా షేర్ చేయాలని పోలీసులు కోరారు.

# ఆగస్టు 20న సుల్తానాబాద్‌లో ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభలు

**మహాసభలను జయప్రదం చేయండి**
**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్**



**గోదావరిఖని, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సుల్తానాబాద్‌లో ఆగస్టు 20న నిర్వహించనున్న ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 20న సుల్తానాబాద్‌లోని నరహరి ఫంక్షన్ హాల్‌లో ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కాలవేణ శంకర్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం. ప్రవీణ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తదితరులు హాజరవుతారని తెలిపారు. దేశంలో కార్మిక చట్టాలు, కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలకు తీవ్ర ముప్పు ఏర్పడిందని కడారి సునీల్ ఆరోపించారు. అసంఘటిత, సంఘటిత రంగాల్లో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలు, సంక్షేమ సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా కుదించడం ద్వారా కార్మికులపై పని భారం, అభద్రత పెంచడంతో పాటు పని గంటలు పెంచే విధంగా నిబంధనలు రూపొందించారని ఆరోపించారు. పారిశ్రామిక పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చడం దురదృష్టకరమన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భవించి 106 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కార్మిక ఉద్యమ చరిత్రలో ఈ మహాసభలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రామగుండం నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు నాంసాని శంకర్, రెడ్డపాక లక్ష్మణ్, సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, షేక్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆయుధమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**కేయూ పరీక్షల నియంత్రణ అధికారి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య రాజేందర్ కట్ల**






**కేయూ క్యాంపస్, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య రాజేందర్ కట్ల అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం బీసీ సెల్ ఆధ్వర్యంలో సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ అధ్యక్షతన విశ్వవిద్యాలయ ఆడిటోరియం ప్రాంగణంలోని బీసీ సెల్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య రాజేందర్ కట్ల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని తిరుగుబాటు జెండా ఎగురవేసిన గొప్ప సామాజిక ఉద్యమకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపిన మహాయోధుడని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, వివక్ష లేని సమాజం కోసం పనిచేయడమే ఆయనకు అందించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, బోధనా, బోధనేతర సిబ్బంది ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వి. సత్యనారాయణ, డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ సాధు రాజేష్, డాక్టర్ తూర్పాటి వెంకటేష్, సాహితీ, శ్రీనివాస్, వంగాల సుధాకర్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వల్లాల తిరుపతి, నవీన్, దామోదర్, పరిశోధక విద్యార్థులు తిరుపతి, రాము, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**హనుమకొండ: (జై భీమ్ న్యూస్)**

బహుజన వీరుడు, గౌడ జాతి ముద్దుబిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బహుజన సదస్సుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హాజరయ్యారు. కలెక్టర్ చాహత్ వాజ్‌పాయ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐనవోలు మాజీ ఎంపీటీసీ పోలేపల్లి మధు గౌడ్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మధు గౌడ్ మాట్లాడుతూ బహుజనుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ జిల్లాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి కలెక్టర్ చాహత్ వాజ్‌పాయ్‌ను కోరారు. అదేవిధంగా అయినవోలు మండల కేంద్రంలో సైతం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును మధు గౌడ్ కోరారు. గౌడ సమాజానికి సంబంధించిన సమస్యలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అయినవోలు మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్పందించడంతో పాటు వెంటనే అందుకు సంబంధించిన స్థల సేకరణ కావాల్సిన నిధులు సమకూర్చాలని అధికారులను ఆదేశించినట్లు అందుకు మధు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా గౌడ సభ్యులు మృతి చెందిన సందర్భాల్లో ఎక్సైజ్ ఎక్స్‌గ్రేషియా మంజూరు విషయంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మధు గౌడ్ కోరారు. అలాగే గౌడ సభ్యులకు కొత్త పెన్షన్లు మంజూరు విషయంలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని కోరారు. ఈ అంశాలపై సంబంధిత ఎక్సైజ్ అధికారులకు ఎమ్మెల్యే నాగరాజు తగిన సూచనలు చేసి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చూపిన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని గౌడ సమాజ సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం మరింతగా సహకరించాలని మధు గౌడ్ కోరారు. గౌడ సమాజ సమస్యలను ఎమ్మెల్యే నాగరాజు సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి హామీ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.



# పేదల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యం

ప్రభుత్వ వైద్యం ప్రజల ప్రాణ రక్షణ కోసమే
వైద్య సేవల విస్తరణలో ఎక్కడ రాజుపడేది లేదు
జిల్లా మెడికల్,వైద్య ఆసుపత్రిపై అభియోగాలు నమ్మొద్దు
పేదలకు వైద్య సేవలు అందించడం ఎంతో గర్వకారణం
గ్రామస్థాయి ప్రభుత్వ వైద్య సేవలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం
ప్రజల ప్రాణాలను కాపాడమే ప్రభుత్వ లక్ష్యం
ప్రభుత్వ వైద్య సేవలో రాజీ పడేది లేదు... సేవ చేయడం మాత్రమే ఉంటుంది
ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ వైద్య సేవలు అందిస్తున్నాం
తెలిసి తెలియకుండా నిందలు వేయడం సరైనది కాదు
గ్రామ గ్రామాన విస్తరిస్తున్న పబ్లిక్ హెల్త్ సెంటర్ల వైద్య సేవలు
నాణ్యమైన వైద్య సేవ కోసం మాత్రమే పాటుపడుతున్నాం
జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలు 100 శాతం పాటిస్తున్నాం
జై భీమ్ క్రైమ్ బ్యూరోతో హన్మకొండ జిల్లా డిఎం అండ్ హెచ్‌ఓ డా. అప్పయ్య ముఖాముఖి సమావేశంలో..




**హన్మకొండ, 18 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

పేదల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ వైద్య శాఖ పనిచేస్తోందని హన్మకొండ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. అప్పయ్య.ఎ తెలిపారు. ప్రభుత్వ వైద్యం ప్రజల ప్రాణ రక్షణ కోసమేనని, వైద్య సేవల విస్తరణలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో గర్వకారణమని, ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జై భీమ్ క్రైమ్ బ్యూరోతో జరిగిన ప్రత్యేక ముఖాముఖిసమావేశంలో జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలు, గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాల పనితీరు, పబ్లిక్ హెల్త్ సెంటర్ల విస్తరణ, ఆసుపత్రులపై వస్తున్న ఆరోపణలు, వైద్య సేవల నాణ్యత తదితర అంశాలపై డీఎంఅండ్‌హెచ్‌ఓ పూర్తి స్థాయిలో వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పబ్లిక్ హెల్త్ సెంటర్ల ద్వారా పేదలు, సామాన్య ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేస్తున్నామని డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. గ్రామ గ్రామాన ప్రభుత్వ ఆరోగ్య సేవలను విస్తరిస్తూ ప్రజలకు స్థానికంగానే వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా వైద్య సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, విధుల్లో అలసత్వం వహించే వారిపై నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య సేవల్లో రాజీ పడేది లేదని, ప్రజలకు సేవ చేయడం మాత్రమే తమ లక్ష్యమని డీఎంఅండ్‌హెచ్‌ఓ అన్నారు. వైద్య రంగంలో ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వైద్య సేవల నాణ్యతను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పేదలకు వైద్యం అందించడం కేవలం విధి నిర్వహణగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా మెడికల్, వైద్య ఆసుపత్రులపై వస్తున్న అభియోగాలను వాస్తవాలు ప్రజలు నమ్మకూడదని తెలుసుకోకుండా నమ్మవద్దని డీఎంఅండ్‌హెచ్‌ఓ సూచించారు. ఆసుపత్రుల్లో ఎదురయ్యే పరిస్థితులు, సమస్యలను పూర్తిగా తెలుసుకోకుండా తెలిసీ తెలియక నిందలు వేయడం సరైనది కాదన్నారు. ఆసుపత్రుల్లో ఏదైనా సమస్య లేదా వైద్య సేవలకు సంబంధించిన ఫిర్యాదు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వాస్తవాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పష్టం చేశారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు తమకు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, అవసరమైన వైద్య సలహాలు అందించడం, చికిత్స అందించడం, అవసరమైతే ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేయడం వంటి సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు సాధ్యమైనంత వరకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో పబ్లిక్ హెల్త్ సెంటర్ల వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండే వైద్యం, సకాలంలో స్పందన, అవసరమైన వైద్య సలహాలు, ఆరోగ్య అవగాహనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సేవల విస్తరణలో ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు. వైద్య సేవలను అందించడంలో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నిర్మాణాత్మక సూచనలు, ఫిర్యాదులను స్వీకరిస్తామని, అయితే వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో అనవసరమైన అపోహలు ఏర్పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చే సలహాలు, సూచనలను 100 శాతం పాటిస్తూ వైద్య సేవలను ముందుకు తీసుకెళ్తున్నామని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెల్లడించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. పేదల ఆరోగ్య భద్రత, ప్రజల ప్రాణ రక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం తమ ప్రధాన లక్ష్యాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవల్లో ఎలాంటి రాజీ ఉండదని, "ప్రజలకు సేవ చేయడమే మా బాధ్యత.. నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు.



# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం
పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం
2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం
హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్' ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి






**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్టాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ÷ూఉ÷ు రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు ÷ుఉ-తిఖం÷ూ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

# అన్నిరంగాల్లో పెరిగిన డ్రోన్ వినియోగం









ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తల రాక
డ్రోన్ల ఎగమతితో పెరగనున్న దేశ ఖ్యాతి
డ్రోన్ కంపెనీల సిఇవోలతో రామ్మోహన్ నాయుడు భేటీ

**కర్నూలు,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

డ్రోన్ సిటీకి దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుఅన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడు డ్రోన్‌ల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో వివిధ డ్రోన్ సంస్థలకు చెందిన సీఈవోలతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 6 లక్షల డ్రోన్‌ల అవసరం ఉండగా.. ప్రస్తుతం 40 వేల డ్రోన్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ చూసి.. డ్రోన్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఓర్వకల్లులో 600 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఈ సిటీలో డ్రోన్ల తయారీ, ప్రొడక్షన్, శిక్షణ అన్ని ఉంటాయని వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. డ్రోన్ శక్తిని వాటి పనితీరును ప్రధాని మోదీ గుర్తించారని చెప్పారు. మన టెక్నాలజీని ఉపయోగించి మనమే డ్రోన్ తయారు చేసి.. విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రధాని మోదీ సంకల్పించారని గుర్తు చేశారు. విదేశాల నుంచి డ్రోన్ల దిగుమతిని కేంద్రం నిషేధించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భారతదేశంలోనే తొలి అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వివిధ డ్రోన్ కంపెనీలతో సమీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకోంటామని తెలిపారు. 150 కంపెనీలకు చెందిన డ్రోన్ సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహిచడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే అసెంబ్లీలో డీఎస్సీ-2025పై చర్చకు రావాలని మంత్రి నారా లోకేశ్ ఆహ్వానిస్తే.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పించుకుని తిరుగుతున్నారని రామ్మోహన నాయుడు ఎద్దేవా చేశారు. మంత్రి లోకేశ్ సవాల్ స్వీకరించి.. అసెంబ్లీలో చర్చకు రావాలని వైఎస్ జగన్‌కు ఆయన స్పష్టం చేశారు. ఓర్వకల్లులో కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు లోకేశ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీకి వస్తే తన కుట్ర బయట పడుతోందనే భయంతో వైఎస్ జగన్.. చర్చకు రావడం లేదన్నారు. కూటమిపై దుష్ప్రచారం చేసి.. తన ఉనికిని కాపాడుకోవాలని వైఎస్ జగన్ చూస్తున్నారని విమర్శించారు. టీచర్లను లిక్కర్ షాపుల వద్ద నిలబెట్టిన వ్యక్తి వైఎస్ జగన్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీచర్లను చూస్తే వైఎస్ జగన్‌కి కోపం, కక్ష అని చెప్పారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేకుండా.. పూర్తి పారదర్శకంగా వేలాది టీచర్ల పోస్టులు భర్తీ చేశామని కేంద్ర మంత్రి వివరించారు. ఏ ప్రభుత్వం చేయని టీచర్ ఉద్యోగాలు.. తాము భర్తీ చేశామని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలోనే ఏపీలో ఊహించని అభివృద్ధి జరిగిందని రామ్మోహన నాయుడు తెలిపారు.

# కాకతీయ కె హబ్ విద్యార్ధులకు అవగాహన

టి హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ

**వరంగల్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

కాకతీయ విశ్వవిద్యాలయ కే-హబ్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు టీ-హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ సెనెట్‌హాల్‌లో నిర్వహించారు. కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టీ సవితా జ్యోత్స్నసారథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీ-హబ్ ప్రతినిధి బాల మురళి భాస్కరన్ విద్యార్థులకు స్టార్టప్ మెంటార్‌షిప్, ఐడియా జనరేషన్, ఐడియా వ్యాలిడేషన్ తదితర అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించారు. విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా ఎలా మలచుకోవాలి, ఒక ఆలోచనలోని కొత్తదనం, సృజనాత్మకత, సాధ్యాసాధ్యాలను ఎలా గుర్తించాలి అనే అంశాలను వివిధ ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు స్టార్టప్‌లు, వ్యాపార ఆలోచనలకు సంబంధించిన పలు ప్రశ్నలను అడగగా, టీ-హబ్ ప్రతినిధులు వాటిని నివృత్తి చేశారు. ఆలోచనలను గుర్తించి, వాటికి సమర్థవంతమైన రూపకల్పన చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇలాంటి 15 శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కే-హబ్ డైరెక్టర్ సవితా జ్యోత్స్న తెలిపారు. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, అంకుర సంస్థల స్థాపనపై అవగాహన, సృజనాత్మక ఆలోచనా శక్తి మరింత పెంపొందుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కే-హబ్ సంయుక్త సంచాలకులు సిద్ధు, కిరణ్ పాల్గొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల, దళవాయి రమాదేవి

**అమరావతి,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

ఏపీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఎస్సీ, బీసీల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించింది. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, తెదేపా అనంతపురం లోక్‌సభ నియోజకవర్గ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు దళవాయి రమాదేవి పేర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సంబంధిత దస్త్రాన్ని గవర్నర్ ఆమోదం కోసం లోక్‌భవన్‌కు పంపినట్లు సమాచారం. ఈ మేరకు అసెంబ్లీలో కూడా సిఎం చంద్రబాబు ఎమ్మెల్సీల పేర్లను ప్రకటించారు.

# బీసీలకు రాజకీయ సాధికారత

**రిజర్వేషన్ల కల్పన గొప్ప నిర్ణయం**
**ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి**

**అమరావతి,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందని లోకేశ్ తెలిపారు. అలాగే పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ నిర్ణయం గొప్ప అవకాశంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యం పెరగడం ద్వారా నిర్ణయాధికారంలో వారికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలుస్తోందని నారా లోకేశ్ అన్నారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారత కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 'ప్రజా ప్రభుత్వం బీసీలకు జై కొట్టింది.. జయహో బీసీ అంటోంది' అని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం?1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముఖ్యమైన అంశమని మంత్రి వివరించారు. నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో మేయర్లు, చైర్మన్లను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నట్లు లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత 13 జిల్లా పరిషత్‌లను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతించారు. ఇది బీసీల సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత దిశగా మరో కీలక అడుగని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్‌తో లక్షలాది బీసీ కుటుంబాల చిరకాల స్వప్నాలు సాకారం కానున్నాయని అన్నారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు టీడీపీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. బీసీల హక్కులను కాపాడటమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను వంచించిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్ మోసం చేశారని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు.

# పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

**మెరుగైన ధర లభించేలా కృషి: అచ్చన్న**

**అమరావతి,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

పొగాకు రైతులకు మెరుగైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో సానుకూల పురోగతి సాధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 117 వేలాలు పూర్తి.. సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీవీ పొగాకు సగటు ధర కిలోకు సుమారు రూ.210గా ఉందని పేర్కొన్నారు. ఇటీవలి రోజుల్లో రోజుకు 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు పొగాకు అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. కొనుగోళ్ల వేగం పెరగడం.. 'నో-బిడ్' శాతం క్రమంగా తగ్గడం మంచి పరిణామం అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించామని తెలిపారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని కంపెనీలు, ట్రేడర్లకు ఇప్పటికే స్పష్టమైన సూచన చేశామని వివరించారు. నో-బిడ్స్'ను మరింత తగ్గించి రైతుల వద్దనున్న పొగాకు వేగంగా కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు లభించే సగటు ధర మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

## ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

**మంటల్లో చిక్కుకుని కార్మికుడు మృతి**

రాజన్నసిరిసిల్ల,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దూరు శివారులోని మహాలక్ష్మి ఫర్నిచర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా 3 ÷ర్ ఇంజన్లతో సిబ్బంది దాదాపు మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో రాత్రి దుకాణంలో నిద్రించిన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఒక కార్మికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్ర చారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాదాపుగా 40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# తిరుగుబాటు తాటిచెట్టు




తాటి చెట్టు నీడలో పుట్టాడు
తాటికొండను చరిత్రలో నిలిపాడు!
పేదవాడిగా పుట్టి
తలవంచి బతకడం కన్నా
తలెత్తి నిలబడటమే మిన్న!
కల్లు గీసే చేతులే
కోటలు కట్టగలవని చూపాడు
గామళ్ల గూటిలో పుట్టిన
వేలాది అడుగులను కలిపి
పాపన్న అనే పిడుగయ్యాడు!

షాపూర్ గడ్డపై
మట్టి గోడలను ఎత్తి
రాయి గోడలుగా మార్చి
ఆధిపత్యానికి సవాల్ విసిరాడు
కోట బురుజులపై
ఫిరంగులు గర్జించినా
అతని గుండెలోని ధైర్యం
ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు!
"పుట్టుకే అధికారం అయితే
పోరాటం ఎవరిది?" అని!

జమీందార్ల దర్పానికీ
మొఘల్ అధికారానికీ
ఒకే సమాధానమై నిలిచాడు-
పాలకుల చరిత్రలో
అతను "బందిపోటు" కావచ్చు...
ప్రజల జ్ఞాపకాలలో మాత్రం
అతను తిరుగుబాటు వీరుడు!
ఖడ్గం చేతిలో ఉన్నంతవరకే
వీరత్వం కాదని
అన్యాయాన్ని ఎదిరించే
ఆత్మగౌరవమే అసలైన ఆయుధమని
పాపన్న నానుడి
తాటికొండ, గోల్కొండ దాక
అతని అడుగుల ప్రతిధ్వని...
అతని పేరు ఒక ప్రశ్న
కాలం అతని శరీరాన్ని
చరిత్రలో కలిపేసినా
అతని ఆలోచనను
చంపలేకపోయింది
తాటి చెట్టు ఎక్కిన చేతిలో

తిరుగుబాటు జెండా ఎగిరింది...
కల్లు కుండ పట్టిన చేయే
కోటల తాళాలు ఉడగొట్టాయి
పాపన్న ఒక పేరు కాదు...
పేదవాడి ఆత్మగౌరవం!
పాపన్నది ఒక కథ కాదు...
అణచివేతపై ఎగిసిన ప్రశ్న!
పాపన్న ఒక వ్యక్తి కాదు...
తెలంగాణ నేలపై
సామాజిక న్యాయం కోసం
గర్జించిన ఒక చరిత్ర!
సర్వాయి పాపన్న గౌడ్-
తలవంచని తాటి చెట్టు...
తరతరాలకు నీడనిచ్చే
తెలంగాణ తిరుగుబాటు జ్ఞాపకం!

**- గడ్డం మనోజ్ కుమార్ గౌడ్**
**తెలంగాణ గౌడ రచయితల సంఘము**
**రాష్ట్ర అధ్యక్షులు.**

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం





**సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు**
**హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ**
**2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం**
**బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు**
**ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం**
**విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

**ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం**
**24 గంటల్లోనే 34 రిజస్ట్రేషన్లు పూర్తి**
**తప్పును సరిదిద్దుకుంటున్నాం**
**మీడియాతో మంత్రి పొంగులేని వివరణ**



**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే పక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే పక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల పక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

**త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపునకు చర్యలు**
**చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో కమిటీ సభ్యులభేటీ..**
**ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా,సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష**

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు గారి నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన 'చర్చలపై ఒక ముసాయిదా నోట్' పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను క్రింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీ (అమరుల కుటుంబాలు): ఉద్యమ క్రమంలో అమరులైన వారు సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం. రెండవ కేటగిరీ (గాయపడిన ఉద్యమకారులు): పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు మరియు ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు. మూడవ కేటగిరీ (జైలు జీవితం గడిపిన వారు): తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు. నాల్గవ కేటగిరీ (కేసులు నమోదైన వారు): నాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు. ప్రత్యేక కేటగిరీలు (సంస్థాగత / క్రియాశీలక శ్రేణులు): కేసులు నమోదు కానప్పటికీ.. ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్-ధామ్ కళాకారులు మరియు వివిధ సంస్థల సభ్యులు. ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యోగులు మరియు వసతి కలిగిన వారు కేవలం 'గుర్తింపు కార్డు / ప్రశంసా పత్రం' ఆశిస్తుండగా.. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్ష అనంతరం చైర్మన్ కేకే, కమిటీ సభ్యులు తదుపరి చేపట్టవలసిన చర్యలను ఖరారు చేశారు. ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ / పోర్టల్ ద్వారా అవకాశం కల్పిస్తారు. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం జరుగుతంది. శాసనసభ్యులు , శాసనమండలి సభ్యులతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సమర్పించాలని నిర్ణయించారు.



# ఏసిబికి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

**20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

నగరంలోని పూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి.. రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. దీంతో ఆమెను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రభావతిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే.. తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ఏసీబీ అధికారులు సూచించారు. మరో వైపు అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ సిబ్బందిలో ఎటువంటి మార్పు రావడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తరచూ ఎప్పుడో అక్కడ.. ఎప్పుడో అప్పుడు లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు. తాజాగా పూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అటువంటి ఘటనే చోటు చేసుకుంది.

# మద్యం మత్తులో యువకుడి దారుణ హత్య

**స్నేహితులే హత్య చేసినట్లు పోలీసుల గుర్తింపు**

**రంగారెడ్డి,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితులే అతడిని కిరాతకంగా చంపేశారు. రివర్స్ కేఫ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు బిహార్‌కు చెందిన అనికేత్‌గా గుర్తించారు. అనికేత్.. తన స్నేహితులు రోహిత్, రాహుల్, అంకిత్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ సమయంలో స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్ర ఆగ్రహానికి గురైన రాహుల్.. అనికేత్ తల వెనుక భాగంలో ఐరన్ రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అనికేత్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణను వేగవంతం చేశారు.

# మెడికల్, డెంటల్ కాలేజీల్లో సీట్ల భర్తీ

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు అవకాశం**

**వరంగల్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పక్రియను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తిరిగి ప్రారంభించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన పలు అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు మరో అవకాశం కల్పించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. నీట్ యూజీ 2026లో నిర్ణీత కటాఫ్ స్కోర్ లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి అర్హత పొందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ పక్రియ ఆగస్టు 18 మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆగస్టు 20 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఇప్పటికే తమ దరఖాస్తులను సమర్పించిన అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని యూనివర్సిటీ స్పష్టం చేసింది. అభ్యర్థులు ఇతర వివరాల కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్‌ను పరిశీలించాలని సూచించింది. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

**తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి**
**అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు**
**అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ**
**నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్ట్18(జై భీమ్ న్యూస్):**

ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణెళి నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమగ్రంగా సమీక్షించారు. సింగూరు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్యామ్‌కు అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయాలని, తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్-ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో ఇంజినీర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం, భారత వాతావరణ శాఖ (ఎఓఆ) తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాలం చెల్లిన సమాచారంపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను తాజా పరిస్థితులకు అనుగుణంగా నవీకరించాలని సూచించారు. ÷రిళిలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే అవకాశం ఉన్న ముంపు ప్రభావంపై అధ్యయనం చేస్తున్న ఐఐటీ నిపుణులతో త్వరితగతిన తదుపరి సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ భూభాగంలో ఎంతమేర వరద ప్రభావం లేదా ముంపు ఏర్పడే అవకాశం ఉందన్న అంశంపై శాస్త్రీయమైన, తిరుగులేని సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన రక్షణ చర్యలను కేంద్రం నుంచి కోరేందుకు ఈ అధ్యయనం తెలంగాణకు బలమైన ఆధారంగా నిలవాలని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై కూడా మంత్రి విస్తృతంగా సమీక్షించారు. ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణలు, సుప్రీంకోర్టులోని కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాల అధికారులు సమన్వయంతో సంక్షిప్తమైనా సమగ్రమైన నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నీరు ప్రకృతి ఇచ్చే సంపద మాత్రమే కాదు... ప్రజల భవిష్యత్తుకు ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యత. తాగునీటిని కాపాడాలి... రైతు పంటను నిలబెట్టాలి... రేపటి అవసరాన్ని విస్మరించకుండా నేటి అవసరాన్ని తీర్చాలి. అందుకే ఈ సమయంలో ప్రతి టీఎంసీకి లెక్క ఉండాలి... ప్రతి విడుదలకు శాస్త్రీయ కారణం ఉండాలి... ప్రతి నిర్ణయంలో రైతు ప్రయోజనం, ప్రజల తాగునీటి భద్రత ప్రతిబింబించాలి' అన్న దిశలో అధికారులు పనిచేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఓ అండ్ ఎం, క్వాలిటీ కంట్రోల్) ఆర్. మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సినీ నటి అనసూయపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ ఊహించని షాక్ తగిలింది. ఇటీవల చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర కలకలం రేపాయి. సనాతన ధర్మం, 'జై శ్రీరామ్' నినాదాన్ని అడ్డుపెట్టుకుని కొందరు అసాంఘిక దాడులకు పాల్పడుతున్నారంటూ ఇటీవల ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై బీజేపీ నాయకులు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో అనసూయ వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్న కాషాయ పార్టీ నేతలు, సోషల్ మీడియా వేదికగా మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. హిందూ ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడిన ఆమెపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వారి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తనపై కేసు నమోదు కావడంపై అనసూయ తీవ్రంగా స్పందించారు. ఈ వివాదంపై ఏమాత్రం తగ్గేదేలేదని స్పష్టం చేసిన అనసూయ, తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేవలం నినాదాలు చేయడం మాత్రమే కాకుండా మనుషుల ప్రవర్తన, నైతికత ముఖ్యమని చెప్పడమే తన ఉద్దేశమని వెల్లడించారు. తాను ఎల్లప్పుడూ సనాతన ధర్మాన్ని గౌరవించే వ్యక్తినని, రాముడిని, ఆంజనేయ స్వామిని ఆరాధిస్తానని పేర్కొంటూనే, తన వ్యాఖ్యల వల్ల అసలైన దొంగలంతా బయటకు వస్తున్నారంటూ విమర్శకులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

## శ్రీదేవి జీవిత చరిత్ర ఆధారంగా 'ది ఎంప్రెస్'.. రామ్ గోపాల్ వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు

దివంగత మేటి నటి శ్రీదేవి జీవిత చరిత్ర ఆధారంగా వస్తున్న 'ది ఎంప్రెస్' పుస్తకంలో తాను ఒక అధ్యాయం రాసినట్లు సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ధ్రువీకరించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, పుస్తకంలో తాను రాసిన అధ్యాయమే అత్యుత్తమంగా ఉందని ప్రచురణకర్తలు తనకు చెప్పారని, అయితే బహుశా ఆ పుస్తక రచనలో సహకరించిన ప్రతి ఒక్కరితోనూ వారు అలాగే చెప్పి ఉండవచ్చని వర్మ తనదైన శైలిలో చమత్కరించారు. శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, "ఆమెతో పనిచేయడం ఒక సెవెన్ స్టార్ హోటల్‌లో ఉన్నట్లుండేది. జీవితాంతం ఆ అనుభూతిని మర్చిపోలేం. ప్రతి సన్నివేశానికి ఆమె 15 నుంచి 20 రకాల హావభావాలను ప్రదర్శించేవారు. 'మిస్టర్ ఇండియా'లోని చార్లీ చాప్లిన్ సన్నివేశంలో ఆమె నటనను ఇప్పటికీ నేను అర్థం చేసుకోలేకపోతున్నాను" అని రామ్ గోపాల్ వర్మ ప్రశంసించారు. తాను ఇప్పటివరకు దర్శకత్వం వహించిన నటీనటులందరిలో శ్రీదేవి అత్యంత అద్భుతమైన నటి అని ఆయన కొనియాడారు. పుస్తకానికి 'ది ఎంప్రెస్' అని పేరు నిర్ణయించినట్లు తనకు తెలియదని, అయితే ఆ బిరుదుకు ఆమె అన్ని విధాలా అర్హురాలని వర్మ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తాను మాత్రం ఆమెను 'స్క్రీన్ క్వీన్' అని పిలవడానికే ఇష్టపడతానని తెలిపారు. శ్రీదేవి జయంతి రోజున ఆమెను గుర్తు చేసుకుంటారా అని అడగ్గా, "లేదు! చనిపోయిన వారి గురించి నేను అస్సలు ఆలోచించను. వారు వెళ్లిపోయాక నా జీవితంలో ఉండరు. నేను ఎల్లప్పుడూ నా భవిష్యత్తుపైనే దృష్టి పెడతాను. ప్రస్తుతం హర్షవర్ధన్ రాణే కథానాయకుడిగా 'పోలీస్ కంపెనీ' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నాను" అని స్పష్టం చేశారు.

అయితే, గతంలో చెన్నైలో శ్రీదేవిని మొదటిసారి కలిసిన సందర్భాన్ని ఆయన నెమరువేసుకున్నారు. "ఆమె గదిలోకి వచ్చిన ప్రతిసారీ, ఏదో స్వచ్ఛమైన గాలి వీచినట్లు అనిపించేది. అటువంటి అద్భుతమైన వ్యక్తి నిజంగానే ఈ ప్రపంచంలో ఉండేవారని మానవాళికి తెలియజేయడం కోసం, ఆమె ఒక్కసారి భూమిపైకి తిరిగి రావాలని కోరుకుంటున్నాను" అంటూ రామ్ గోపాల్ వర్మ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు.







# సినీ పరిశ్రమలో విషాదం.. 'తగ్గేదే లే' ఫేమ్ అనన్య రాజ్ కన్నుమూత

చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. బాలీవుడ్‌తో పాటు తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్న యువ నటి, మోడల్ అనన్య రాజ్ (27) కన్నుమూశారు. అయితే ఆమె జులై 15వ తేదీనే మరణించగా, ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు దాదాపు నెల రోజుల తర్వాత ఆగస్టు 16న అధికారికంగా వెల్లడించారు. ఈ ఆలస్య ప్రకటనతో సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. అనన్య రాజ్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆమె కుటుంబ సభ్యులు ఒక సుదీర్ఘమైన, భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "చాలా బరువెక్కిన హృదయంతో ఈ విషయాన్ని తెలియజేస్తున్నాం. మా ప్రియమైన అనన్య జులై 15న తెల్లవారుజామున నిద్రలోనే శాంతంగా కన్నుమూసింది. గత ఏడాదిగా ఆమె తీవ్రమైన శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పోరాడింది. ఒక యోధురాలిలా ఎంతో ధైర్యంగా నిలబడింది. ఈ కష్ట సమయంలో మాకు ప్రైవసీని గౌరవించాలని కోరుతున్నాం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించండి" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ముంబైలో పుట్టి పెరిగిన అనన్య రాజ్, మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి అడుగుపెట్టారు. 2016లో '7 అవర్స్ టు గో' చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేశారు. ఆ తర్వాత 'ది ఫైనల్ ఎగ్జిట్', కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ నటించిన 'ఘోస్ట్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు. తెలుగులో నవీన్ చంద్ర హీరోగా వచ్చిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తగ్గేదే లే' (2022) చిత్రంతో పాటు 'మద్రాసీ గ్యాంగ్' సినిమాలోనూ నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఇంత చిన్న వయసులోనే అనన్య మరణించడం, ఆ వార్తను కుటుంబం నెల రోజుల పాటు గోప్యంగా ఉంచడం పట్ల పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు సంతాపం తెలుపుతూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# బోనాలపై ట్రోలింగ్.. కన్నీళ్లు పెట్టుకున్న నటి ఫరియా అబ్దుల్లా

ప్రముఖ నటి, 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియాలో భావోద్వేగానికి లోనయ్యారు. బోనాల పండుగలో పాల్గొన్నందుకు తనను ట్రోల్ చేస్తున్న వారిపై స్పందిస్తూ ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ద్వేషాన్ని ప్రేమతోనే జయిస్తానని, తన కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తూ ఓ సుదీర్ఘ వీడియోను పోస్ట్ చేశారు. ఇటీవల హైదరాబాద్ పాతబస్తీలోని మీర్ ఆలం మండిలో ఉన్న శ్రీ మహాకాళేశ్వర అమ్మవారి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఫరియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సంప్రదాయ దుస్తుల్లో బంగారు బోనం ఎత్తుకొని, డప్పు చప్పుళ్లకు ఉత్సాహంగా నృత్యం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అయితే, ముస్లిం నేపథ్యం ఉన్న ఫరియా హిందూ పండుగలో పాలుపంచుకోవడాన్ని సోషల్ మీడియాలోని కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమెను 'కాఫిర్' (మత విశ్వాసం లేని వ్యక్తి) అని సంబోధిస్తూ, మతానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ దారుణంగా ట్రోల్ చేశారు. ఈ ట్రోలింగ్‌పై ఫరియా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో కన్నీళ్లు పెట్టుకున్నారు. "మా నాన్న (సంజయ్ అబ్దుల్లా) పుట్టుకతో హిందువు. ఆయన ఇస్లాం సిద్ధాంతాలు నచ్చి ఆ మతంలోకి మారారు. ఒక మతాన్ని అంతగా ఇష్టపడి స్వీకరించిన వ్యక్తి నన్ను పెంచినప్పుడు, నాకు అందులోని మంచి విషయాలే కనిపించాయి" అని ఆమె భావోద్వేగంగా చెప్పారు. "నన్ను 'కాఫిర్' అని పిలుస్తూ ద్వేషించే వారికి కూడా మంచి జరగాలనే కోరుకుంటాను. నేను ద్వేషాన్ని ప్రేమతోనే ఎదుర్కొంటాను" అని స్పష్టం చేశారు. ప్రకృతిలోని చెట్లు, పుట్టలు, సీతాకోకచిలుకలు.. ఇలా ప్రతి అంశంలో తాను దైవాన్ని చూస్తానని ఫరియా తెలిపారు. అన్నింటిలో భగవంతుడిని చూడకపోతే జీవితంలో చాలా కోల్పోతామన్నారు. తన ప్రేమను, భావ ప్రకటన స్వేచ్ఛను ఎవరూ ఆపలేరని, ఇదే తన తిరుగుబాటు అని ఆమె తేల్చిచెప్పారు. ఫరియాకు మద్దతుగా నటి లక్ష్మీ మంచుతో పాటు పలువురు నెటిజన్లు, అభిమానులు నిలుస్తున్నారు.

